కథానిక

# సమర్థుని సన్నిహితత్వం

దివ్యప్రభాకర్

"వెంకటరత్నం వ్యాపారసరళి తెలీక దెబ్బ తిన్నాడుగానీ నాకేమేం!" అంటూ ఉన్న ఆరెకరాలూ అమ్మి బస్తీలో అద్దాలూ, ఫాన్లతో సహా కాఫీహోటలు బ్రహ్మాండంగా ప్రారంభించాడు గోపాలం. ఇందుకు ప్రోత్సాహకుడు ఎవరో మనకి తెలీదు కానీ నలుగురూ అనుకోడం నారాయణేనని, నారాయణ బస్తీ మీద కుస్తీపట్టి చాలాసార్లు చిత్తుఅయిన అనుభవశాలి. గడుసరి. రోజుకు ఏ రెండుమూడు గంటలో తప్ప మిగిలిన కాలమంతా ఆలోచిస్తూనే వుంటాడు 'బెదురుమాపులు చూస్తూ కంటికి నదరుగావుండే పల్లెవాసపు పెద్ద రైతుల కోసం. "నారాయణ ఇలాంటివాడు" అని ముందే తెలిసిన గోపాలం వాళ్ళ గ్రామంలో మీసం మెలేశాడు తప్ప ఇంకేమీ చెయ్యలేదు. అయినా గోపాలానికో నమ్మకముంది. నారాయణ ఎంత స్వలాభంతో బస్తీలో తన చేత హోటలు పెట్టించినా కాఫీనీళ్ళూ, బీడీ ముక్కలకంటే పిక్కేదేముంది? ఐనా తన ముప్ఫయిఅయిదేళ్ళ జీవితంలో యీ పాతికేళ్ళ నారాయణల్ని ఎంతమందిని చూసుంటాడు? ఇంతకీ బస్తీ తనకి కొత్త కాబట్టి అవసరానికి అడ్డం పెట్టుకుంటున్నాడు తను నారాయణని. అంతేగా! పైగా తనుమాత్రం తక్కువవాడా యేం? వాణ్ణి బస్తీలో ఎన్ని పనులకి అడ్డంపెట్టుకుని, ఎంత చాకిరీ చేయించుకోండే ఒదుల్తాడు తను. పిచ్చి ఎదవలకి తెలీక "గోపాలం నారాయణ వల్లో పడ్డాడ్రోయ్" అనుకుంటూరు గానీ...! "అందరివగ్గరా ఆడిన ఆటలు సాగుతయ్యా!" అని యింకోసారి తన్నుతానే మెచ్చుకుని, జబ్బచరుచుకున్నాడు ఎవరూ లేనప్పుడు.

కనీసం యాభై, అరవైమంది ఆఫీసర్లకే, వాళ్ళకీ బ్రహ్మాండమైన టీపార్టీ చేయిద్దామన్నాడు గోపాలం. కాని నారాయణ డబ్బుదండగ అన్నాడు.

పాపం, ఏమాట కామాటే అనుకోవాలి. నారాయణ ఒక్కక్షణంకూడా గోపాలాన్నీ, హోటల్నీ వదలకుండా అంటిపెట్టుకునే వుంటున్నాడు. పనివాళ్ళుగానీ, పాసింజర్సుగానీ తమకు తోచినవిధంగా అనుకున్నారు. "భాగస్వామి" అని కొందరూ, "మేనేజర్" అని కొందరూ, "ప్రొప్రయిటరే లే, నాంకేవాస్తే క్యాష్‌లో ఆయన్ని కూర్చోపెడుతున్నాడు" అని కొందరూ, అనుకున్నా నారాయణ ఏమీ పట్టించుకోలేదు.

ఓరోజున చిన్నబడ్డీ ఒకటి హోటలువాకిట్లో ఎడంచేతిప్రక్కగా ఓరెండుగజాల గుమ్మాన్ని ఆక్రమిస్తూ వెలిసింది. గోపాలం "ఎవరు పెట్టమన్నారయ్యా?" అన్నాడు. "మీ తమ్ముడు గారు" అంటూ కిళ్లీబడ్డీ ఓనరు జవాబిచ్చాడు. గోపాలానికి అర్థమైంది తన తమ్ముడెవరో! నారాయణ తను తన తమ్ముణ్ణని చెప్పుకుంటున్నాడా? ఏమో లేకపోతే పోలికలేమన్నా వున్నాయేమో? గోపాలం అప్రయత్నంగా అద్దాల్లో ముఖం చూసుకుని తల తిప్పేలోపల లోపలనుంచి వస్తున్న నారాయణ ముఖం కనిపించింది. గోపాలం వెంటనే ఎందుకో "ఇద్దరికీ పోలికలున్నట్టున్నాయే" అనుకున్నాడు. కిళ్లీ బడ్డీ బాగానే సాగుతోంది. గోపాలం మళ్ళీ అతన్ని ఏమీ అడగలేదు. రెండుపూట్లా కిళ్లీబడ్డీ సూర్యనారాయణ ఈ హోటలుకే ఒస్తున్నాడు కాఫీకి.

గోపాలం క్యాష్‌లో కూర్చుని డబ్బులు మాత్రం తీసుకుంటూండేవాడు. అతను ఎవ్వరితో మాట్లాడేవాడూ కాదు. తనభాష బాగుండదనీ, ఒచ్చేవాళ్లల్లో గొప్పవాళ్ళూ వుంటొచ్చనీ తన పల్లెటూరితనం ఎక్కడ బైట పడిపోతుందోననీ అతని భయం.

పనివాణ్ణి పెట్టాలన్నా, తీసివెయ్యాలన్నా, జీతం ఏర్పాటుచెయ్యాలన్నా గోపాలాని మీకే

బాధ్యతలేదు. నారాయణ సర్వతోముఖంగా సహాయంచేస్తూండేవాడు అన్నిపనులూ నారాయణ చేతిమీదుగా జరిగిపోతూంటే గోపాలం ఏమంత పట్టించుకోలేదు. తన పని యిప్పుడు చాలా హాయిగా వుంది. పగలల్లా క్యాష్‌లో కూర్చోటం, హోటలు కట్టెయ్యగానే డబ్బుపట్టుకుని మేడమీదకెళ్ళి అలమారులో పెట్టుకుని హాయిగా నిద్రపోడం. జీతంలేకుండా ఇంత చేదోడువాదోడుగా వుంటున్నందుకు నారాయణంటే గోపాలానికి తీరని అభిమానం, కృతజ్ఞతా యేర్పడ్డాయి. నారాయణని నీచుడిక్రింద జమకట్టి పితూరీలు చెప్పిన వాళ్ళని కడుపుమంటతీరా తిట్టాడు గోపాలం.

హోటలు బాగా అమ్ముతోంది. నెలనెలా లెక్కలు తేలుస్తూనేవున్నారు. సంతృప్తికరమైన లాభమే ఒస్తోంది. ఓరోజున నారాయణ క్యాష్ దగ్గర నిలుచున్నాడు గోపాలం లోపలకెడితే. గోపాలం రాగానే నారాయణ తప్పుకుంటూ క్యాష్‌లోవున్న పది పదిరూపాయల నోట్లు లెక్కపెట్టుకుంటూ తీసుకు వెళ్లిపోయాడు. గోపాలం ఉక్కిరిబిక్కిరి అయి ఆలోచనలో పడ్డాడు. ఏదో అవసరంరాందే నారాయణ అంత స్వతంత్రించి తీసుకునే మనిషికాదు. మూడునెల్లనించీ నిజంగా అతని స్థానంలోనే 'మేనేజరు'అని నియిమిస్తే నెలకి వందా గుంజేవాడు. అవును! ఏదో అవసరమే ఒచ్చివుంటుంది. అయినా తను నారాయణ ఋణం తీర్చుకోలేడు. ఉప్పుడుబియ్యం దొరక్క హోటళ్ళవాళ్ళంతా తలక్రిందౌతూంటే నారాయణ పుట్టించి తెచ్చాడు. మొన్నమటుకు మొన్న? తెల్లవారితే పంచదార లేదు. కోటా యివ్వడానికి ఇంకా పదిరోజులుంది. ఎలాగా అని దిగులుపడుతూంటే ఆరాత్రి ఎక్కడ ఏం మాయచేశాడో రెండు కట్టలబండీమీద వేయించుకొచ్చి కబురుచెప్పాడు- ఏదో అవసరమొచ్చిన మాట వాస్తవమే అనుకున్నాడు గోపాలం.

ఆనెల లెక్కలుచూడటంకూడా పూర్తయింది. లాభంలో అభివృద్ధి తప్పలేదు. గోపాలం మనసులోంచి కృతజ్ఞత ప్రవహించి నారాయవేపు పరవళ్లు తొక్కుతూ వెళ్ళింది. నారాయణ ఒక్క రోజులేకపోతే హోటలు ఎలాగడుస్తుందా అన్న పరిస్థితి ఏర్పడింది. తను ఆరోజు బాధ్యతంతా మీదవేసుకుని ఆయాసపడేవాడు గోపాలం. నారాయణ ఊరికెళ్ళాడు. ఆరోజే లోపల పని చేసే యిద్దరు కుర్రాళ్ళు దెబ్బలాడుకున్నారు. తను క్యాషువదిలి వెళ్ళడానికి వీల్లేదు. "ఆ ఇద్దర్నీ యిట్టా రమ్మను"అని కబురుపెట్టాడు. వాళ్లు రాలేదు కబురంపి గంటయినాను. కొట్టుకున్నారుట. ఎవరో పనివాళ్ళే సర్దేశారుట. అదే కబురు, నారాయణుంటే అటు ఊరుకునేవాడూ? ఇద్దర్నీ చెరి నాలుగూ పీకి, మెడపట్టుకుని వాకిట్లో నెట్టేవాడు. తను జీతం లెక్కచూసి యిద్దామనుకునేవాడు. నారాయణ 'దమ్మిడీ యివ్వద్దు'అని అరిచేవాడు.

పోనీ ఏదో సర్దుకున్నారుగదా! అని తనూ సర్దుకున్నాడు గోపాలం.

"ఏవండీ మీ ప్రొప్రయిటరుగారు మిమ్మల్నడిగి డబ్బుతీసుకోమని చెప్పారు, ఇస్తారా?"అన్నాడొక పెద్దమనిషి క్యాషుబల్లకు ప్రక్కగావున్న ఓ కుర్చీలో కూర్చుంటూ.

"ఎవరూ?"అన్నాడు గోపాలం ఏదో కొత్త మాట వింటున్నట్టు ముఖంపెట్టి.

"మీ ప్రొప్రయిటరండీ, నారాయణంగారు" అని రెట్టించాడు, వచ్చిన సర్వరుకి కాఫీ ఆర్డరిస్తూ.

గోపాలం ఒక్క నిమిషంలోపలే ఉద్రేకపడ్డాడు. నారాయణగాడు ఇలా ప్రచారంచేసుకుంటున్నాడన్నమాట. "రానీ, నాలుగూకడిగేసి తరిమి తగిలేస్తాను"అనుకున్నాడు గోపాలం.

"ఎంతా?"అన్నాడు ఇస్తే యివ్వకూడదనుకున్న గోపాలం యిచ్చే పోజుపెట్టి.

"అయిదొందలు" కాఫీ చప్పరిస్తూ జవాబు చెప్పాడు పెట్టుబడిదారు.

"అయిదొందలే!" లోపల్లోపల మండిపోతున్నాడు గోపాలం. అయినా పైకిమాత్రం మర్యాదగా "చీటీ వుందా?"అని అడిగాడు.

"ఏంచీటీ?...లేదు."

"చీటీలేకుండా యివ్వటం ఎట్టా?...వీల్లేదు, ఆయనొచ్చాకే రండి" అన్నాడు నిబ్బరంగా. వచ్చినాయన "ఆయనసొమ్మివ్వటానికూడా

మీ పెత్తనమేమిటండీ?" అని సణుక్కుంటూ "రేపొస్తా"నని వెళ్ళిపోయాడు. వెనక్కి పిలిచి ముక్కుచెక్కేద్దామనుకున్నాడు గోపాలం. గట్ల గాదాలదగ్గర తన తడాకా ఇక్కడివాళ్ళకు తెలీకపోయినందుకూ, కనీసం తను వాటిని కథలుగానైనా ఇక్కడివాళ్ళకూ చెప్పనందుకు కించపడ్డాడు.

బోర్డుమీద పేరువేయించమంటే "ఇంత వ్యాపారం అలా పేరుపెట్టుకుంటే సాగినట్టే!... వ్యాపారసరళి తెలిసినవాడెవడూ పేరేయించుకోడు. మద్రాసూ మసూరి వెంకటరత్నం ఏమయ్యాడూ?... గొప్పకి తలకాయంత అక్షరాలతో పేరుపెట్టుకుని మట్టితిన్నాడు" అన్నాడు నారాయణ హోటలు పెట్టేముందు. మంచి తంటానే!.. ఆరాత్రి గోపాలానికి నిద్రపట్టలేదు.

మర్నాడు అదేవేళకి మళ్ళీవచ్చాడు బాకీదారుడు. నారాయణ రాలేదన్నాడు గోపాలం. ఆయన గుమ్మందిగుతూంటే ఎదురొచ్చాడు నారాయణ. పెట్టుబడిదారుడు ఫిర్యాదుచేశాడు ప్రొప్రయిటరు నారాయణతో గుమాస్తా గోపాలంమీద. "ముందు డబ్బిచ్చి పంపెయ్, తరవాత మాట్లాడదాం!"అని నారాయణ బిగ్గరగా అన్నాడు. నారాయణని మింగేద్దామనుకున్నాడు. జనం డబ్బివ్వటానికొచ్చారు. హాలు ప్యాసింజర్లతో కిటకిటలాడుతోంది. గోపాలం మాట్లాడలేదు. డబ్బువసూలు చేసుకుంటున్నాడు. నారాయణ మళ్ళీ రెట్టించాడు. గోపాలం కరుడుకట్టిపోయాడు. "సరే, అయిందొందల్తో పోయింది లేదు పదిరోజుల్లాభం... వీడి సంగతేదో ఇవాళ తేల్చేస్తే సరిపోతుంది" అనుకుని అడుగు సొరుగులోంచి డబ్బుతీసి బల్లమీద పడేశాడు మౌనంగా. పెద్దమనిషి అవితీసుకుని నారాయణతో చెప్పి వెళ్ళిపోయాడు. గోపాలం మిన్నకున్నాడు.

ఆ రాత్రి గోపాలం మేడ మీదికి పిలిచాడు నారాయణని. వస్తూనే, ప్రశ్నలేకుండానే నారాయణ యెత్తుకున్నాడు. "నేనేదో స్వంతానికి తీసుకున్నాననో, దుబారా చేశాననో అనుకుంటున్నావు గావును! కల్లోకూడా అనుకోకు. అయిదొందల్తో నాకు యీ జన్మలోనే అవసరం కలగదు. పంచదార కట్టలకని మిల్లుకివెళ్లాను. కాని దురదృష్టం... తెస్తూంటే మధ్యదారిలో లారీని పట్టుకున్నారు. నన్ను పట్టుకుంటే యింకో అయిదొందలు వదిలేవి. కిమ్మనకుండా డ్రైవరుచేతిలో ఓ పాతికపెట్టి పేరు చెప్పకురా బాబూ! అని జారుకునేసరికి ప్రాణాలు కడగట్టాయి. నీకు నామీద అంత అపనమ్మకంగావుంటే, నేనేంకట్టుకు కూర్చోవాలో ననుకోవడంలేదు. నీ యిష్టం!"అని ముఖం గోడవేపు త్రిప్పుకున్నాడు.

గోపాలంలో చలనం ప్రారంభమైంది. నారాయణని అపార్థంచేసుకున్నందుకునొచ్చుకున్నాడు. సర్దేశాడు తనకావుద్దేశం పోయిందని. పల్లెటూరి అమాయికత్వం అంటే యిదేగావును! అందరూ నారాయణని ప్రొప్రయిటరు అని ఎందుకంటున్నారోనని ఆ విషయం ఎత్తాడు. "దానికి నేనా బాధ్యుణ్ణి గోపాలం! అందరూ అలానంటే నేనేం చెయ్యగలను? అది నా పొరపాటు అంటావా?" అన్నాడు నారాయణ ఆవేశపడుతూ.

నారాయణ అందరిలో అలా చెప్పివుంటాడనేందుకుఆధారమేమీలేదు. వాస్తవానికి నారాయణ ప్రొప్రయిటరుకుండవలసిన శ్రద్ధా, బాధ్యతలు వహిస్తున్నందుకు అందరూ అనుకోడంలో తప్పులేదు. కాని గోపాలం మాత్రం మనసు కష్టపెట్టుకోడం తప్పలేదు. ఎంత యిదయినా ఆ రెకరాలూ అమ్మి, పాడీ, గొడ్డుగోదా, ఇల్లూవదిలి యీ బస్తీకి వచ్చింది నాలుగు డబ్బులకోసం, ఆపేరుకోసమేగా! ఎంత ప్రయత్నించినా గోపాలానికి రెండోదిసాధ్యంకాలేదు. అప్రాప్తంగానే వుండిపోయింది.

ఆ యేడు వాస్తవంగా కట్టవలసిన టాక్సు ఎంతో వివరంగా చెపుతూ దొంగలెక్కలు వ్రాసేందుకు ఓగుమాస్తాని నియమించాడు నారాయణ. రెంటికీ తేడా మూడువేల పైచిలుకు. గోపాలం తృప్తిగా చూశాడు నారాయణవేపు.

ఆయేడు గోపాలం పెళ్ళాం పిల్లల్ని బస్తీకి తీసుకొచ్చి, మంచియిల్లు అద్దెకుతీసుకుని కాపరం పెట్టాడు. నారాయణని "పెళ్ళి చేసుకోవేం?" అన్నాడు గోపాలం.

"లైఫ్ స్టాండర్డుకాందే చేసుకోను"అన్నాడు నారాయణ దాని అనర్థాలు వివరిస్తూ. గోపాలం మాట్లాడలేదు. నారాయణ జీవితం ఎప్పుడు

స్టాండర్డు అవుతుందో ఆలోచిస్తూ ఊరుకున్నాడు.

ఓరోజున మామూలుగా వ్యాపారం సాగే సమయంలో ఒక స్త్రీ వచ్చి క్యాషు దగ్గరగా బైటగుమ్మంలో నిలబడింది. "ఏం కావాలమ్మా?" అని ప్రశ్నించాడు గోపాలం.

"ఏం లేదు. నారాయణగారు మిమ్మల్నడిగి డబ్బు తీసుకెళ్ళమన్నారు. ఇవ్వండి..యాభై" అందామె. గోపాలం సమాధానం చెప్పడానికి తడుముకోవలసి వచ్చింది. అందుకని ప్రశ్న వేశాడు. "ఎవరు నువ్వు?"

"నేనెవరైతే మీకెందుకు? డబ్బుయివ్వమంటే" విసుగ్గా హోటలు తనదే అయినట్టూ, గుమాస్తా అభ్యంతరం చెపుతూన్నట్టూ అంది.

"ఇవ్వడానికివీల్లేదు. అతన్ని రానీ మాట్లాడాలి" అని గోపాలం పొమ్మన్నట్టు మిర్రమిర్రచూసి తనపనిలో నిమగ్నమయ్యాడు.

ఆ వచ్చినామె పెద్దకోపంగా "ఏమిటయ్యా మధ్యనీ పెత్తనం? నీ ముల్లె అంతా పోయినట్టు యీసడిస్తావేంటి? గుమాస్తావి ఎంతలో వుండాలో అంతలోనే వుండు" అంది.

గోపాలంలో సహనం చచ్చింది. ఇంతవాకట్నుంచి ఓపికపట్టినకసి అంతా వెళ్లగక్కుతూ "ఎవరే గుమాస్తా? పిచ్చిపిచ్చివాగుడు వాగావంటే మొఖంపగుల్తుంది... ముందునడు తరవాత ఆలోచిద్దాం పూటిప్రొప్రయిటరుగిరీ, నీ కొరసానీగిరీని. వెళ్లువెళ్లు" అని కసిరాడు బిగ్గరగా.

దాంతో ఆమె కొంచెం తగ్గి చుట్టూ కలియజూచి ఏదో సణుక్కుంటూ—బహుశః శాపనార్థాలుగావున్న—వెళ్ళిపోయింది.

గోపాలం నారాయణ ఎక్కడున్నాడో చూసిరమ్మని కుర్రాణ్ణి పంపాడు. మేడమీద నిద్రపోతున్నాడని తెలుసుకొని సప్లయర్ని క్యాష్ దగ్గర నిలబెట్టి గబగబా అంగలు వేసుకుంటూ తుండుగుడ్డతో నూనెజిడ్డు తుడుచుకుంటున్నాడు.

గోపాలం ప్రవేశిస్తూనే ఆవేశంగా "ఏమిటోయ్ ఇదంతా? ఆ దెవ్వతో వచ్చి నువ్విమ్మన్నావని డబ్బడుగుతుందేమిటి? పైగా నేనేదో గుమాస్తా నయినట్టు. మీసొమ్ము తిన్నట్టు దుమ్మెత్తిపోస్తుంది...ఏమిటిసంగతి?" అటూ ఇటూ పచార్లు చేస్తూ గబగబా.

నారాయణ చలించలేదు. మెల్లిగా ఓసారి తల తిప్పి, గోపాలం ముఖాన్ని పరకాయించిచూసి "అయితే?" అన్నాడు.

"అయితే ఏమిటి? ఇవ్వాళ ఏదో తేల్చిచెప్పు. నీకు జీతంకావాలా? అసలూ ఆ సంగతి మొగమాటంలేకుండా... నెలకింతని లెక్కచూసియిచ్చేస్తాను. ఈ ముసుగులో గుద్దులాట ఎందుకొచ్చింది. నాకేసంగతీచెప్పు నిక్కచ్చిగా" అని మాటలు దొర్లిస్తూ అన్నాడు.

"నాకు జీతం ఏమిటి? ఏమిటి నువ్వుమాట్లాడేది?" నారాయణ ఎన్నడూ అనుకోని, అసంభవమైన సంగతి వింటున్నట్టు ఫీలిగ్సు చూపిస్తున్నాడు.

గోపాలానికి ఆ సమాధానమేమిటో ఊహించరానిదైంది. తిరిగీ తనను ప్రశ్నలు ఎదుర్కొన్నాయి. పైగా ఆ ప్రశ్న ఏమిటో అర్థంకానే లేదు. నారాయణ డ్రాయరు సొరుగులాగి ఓ ఫైలు తీశాడు. దాన్ని తెరిచిచూస్తూ గోపాలం దగ్గరకొచ్చి అక్కడ బల్లమీద దాన్ని పడేసి "చూడు" అన్నాడు.

గోపాలానికి ఇంగ్లీషుగానీ, తెలుగు బాగాగానీ చదివే పరిజ్ఞానంలేదు ఆ కాగితాన్ని తీసి మెల్లగా, జాగ్రత్తగా చదువుతున్నాడు.

నారాయణ ఏభావంలేకుండా, ప్రశాంతగా... సిగరెట్టు ముట్టించి.... కుర్చీలో కూర్చున్నాడు. ఒక్కొక్క కాగితాన్నే చదువుతున్నకొద్దీ గోపాలంలో రక్తం గడ్డకట్టటం ప్రారంభించింది.

అవన్నీ పెద్ద మొత్తాలుగా సరుకులుకొన్నవాటి తాలూకు రశీదులూ, టాక్సు, మునిసిపల్ తదితర కాగితాలూ, ఆఫీసుల రసీదులూ వగయిరాలు, వాటన్నిటిమీదా ప్రొప్రయిటరు నారాయణ అనేవుంది. గోపాలానికి ఈ బిల్లులూ, టాక్సు కాగితాలూ అసలు వున్నాయనే తెలీదు. గోపాలం ఉగ్రుడైపోయాడు. అమాంతం నారాయణని ఖూనీచేద్దామనుకున్నాడు కాని ప్రపంచం కళ్ళముందు తిరిగింది. మాట రాలేదు. ఇంతలో నారాయణ అందుకుని "అన్న సాక్ష్యం, ఆధారంతో అసలు ఈ హోటలు అంతా వశపరచుకోవచ్చు. కాని నాకు ఆ తలంపు లేదు నువ్వు అమ్మినభూమి ఆ రెకరాలు. దాన్ని తిరిగికొనక్కో.

పైకర్చులకి ఓ వెయ్యి రూపాయలు తీసుకో. ఇక హోటలు అనే మాట మర్చిపోయి వ్యవసాయం చేసుకో... ఇదే నాకు న్యాయంగా తోచింది. ఇంతవరకు వచ్చిన లాభం నీ పొలానికి సరిపోతుంది. రెండుమూడురోజుల్లో వెయ్యియిచ్చేస్తా. ఇంకా ఏమన్నా పెద్ద ఎత్తు ఎత్తదలుచుకుంటే హోటలు నీదనేందుకు పిసరంత ఆధారం లేదు" అని నారాయణ బైటకు వెళ్ళిపోయాడు.

* * *

ఇంకటితోనైనా నాశనం కాకుండా తిరిగొచ్చినందుకు బంధువులూ- మిత్రులూ గ్రామం గ్రామమంతా అభినందించారు గోపాలాన్ని. "అదృష్టవంతుడే" అన్నారు. "చిత్రం" అన్నారు.

గోపాలం నెత్తిన చెయ్యి పెట్టి హోటలు కట్టుకున్న నారాయణ ఇప్పుడు "హోటల్ ప్రొప్రయిటర్సు అసోసియేషన్" అధ్యక్షుడు, మునిసిపల్ కౌన్సిలర్.

దుర్మార్గం, మోసం చేసిన పాపాత్ముల నాశనం అయినట్టూ, అవుతున్నట్టు మన పురాణాలూ, గ్రంథాలూ, ఆధునిక రచనలూ కూడా చాటుతున్నాయి. కాని నారాయణమాత్రం యింతవరకూ ఏం కాలేదు. సరే చూద్దాం కొంతకాలం. రాజకీయవేత్తా, ప్రజామంత్రీ అవుతాడేమో ముందు ఎన్నికల్లో!

స్కెచ్

# క్షణికమైన విలువలు

"శాంతిశ్రీ"

సంధ్యచీకట్లు నలుప్రక్కలా క్రమ్ముకుంటున్నాయి. రవి పడుకున్న గదిలోనికికూడ వీరవిహారానికొచ్చాయి. కాని ఇంతట్లోకి రవి తల్లి లాంతరు వెలిగించి బల్లమీదపెట్టి వెళ్ళిపోయింది. రవి అప్పుడే నిద్రనుంచి మేల్కొని ప్రక్కకు ఒత్తిగిలబోయాడు. ప్రక్కటెముకలు కళుక్కుమన్నాయి. ఆ బాధతోపాటు జరిగిపోయిన సంఘటనలన్నీ స్మృతిపథంలో మెదలసాగేయి. తనీ పరిస్థితులలో వుండటానికి కారణం ఏమిటి? క్రిందటి మేడు ఈరోజుల్లో నిక్షేపంలాగున్నాడే! జ్వరం చాలారోజులనుండి తీయకుండా కాస్తోంది. డాక్టర్లకు చూపిస్తే ఆ మందుకాదని ఈమందు ఇదికాదని అది ఇచ్చి జ్వరం తగ్గుముఖం పట్టకపోయేసరికి మనోవ్యాధని తేల్చేశారు. అయితే ఈ మనోవ్యాధి ఎందుకు వచ్చినట్లు? క్రిందటిసంవత్సరం ఈ రోజుల్లో నిక్షేపంలాగున్నాడే! సరిగా క్రిందటిసంవత్సరం ఈరోజుల్లోనే బి. ఏ. పరీక్షకెళ్ళాడు. పరీక్షాఫలితాలు తెలియగానే సుముహూర్తం నిశ్చయిద్దామనుకున్నారు పెద్దలు. తను శశిని ప్రేమించాడు. శశికూడా తనని గాఢంగా ప్రేమించింది. తను చెల్లెలి కుమారుడైనా బీదరికంలో వుండటంవల్ల మామయ్య యిష్టపడకపోతే చివరికి వుపవాసాలుకూడా చేసి తండ్రిని ఒప్పించింది శశి. తను బి. ఏ.లో జాయిన్ అయిన సంవత్సరమే శశి యింటర్‌లో చేరింది. రోజూ యిద్దరూకలిసే శశివాళ్ళ కార్లో కాలేజీకి వెళ్ళిరావడం జరిగేది. శశి తనని ఇంటి పద్ద దిగవిడిచి వెళ్ళేది. వాళ్ళ స్నేహం రెండేళ్ళల్లో ఎప్పటికీ విడిపడనంత చిక్కగా అల్లుకుపోయింది. మిగతా లతలేరోజున నీరుపోయకపోతే ఆరోజే ఎండుముఖంపడతాయి. కాని అనురాగలతకు చిగర్చటం మాత్రమే తెలుసు. గాలి వీచినపుడల్లా అమరసందేశాలు వినిపించేది. పబ్లిక్ పరీక్షలు దగ్గిరకొచ్చాయి. తనకెప్పుడూ పరీక్షలంటే భయంవుండేదికాదు. ఏ యితర గొడవలూ లేక దీక్షగా చదివి నిక్షేపంగా ఉత్తీర్ణుడవుతుండేవాడు. అదృష్టానికికూడ తనంటే అమిత ప్రేమ. అంత ప్రేమించేవాళ్ళుకూడా హఠాత్తుగా ఎందుకుమారిపోతారో అర్థంకాలేదు తనకి.

ఇంతలోకి రవితల్లి ఓవల్టిన్ తీసుకురావడంచేత రవి భావపరంపరలకు అంతరాయం కలిగింది. ఒంట్లో చాలా నీరసంగావుంది. కళ్ళు మూసుకున్నాడు. కాని నిద్రరాదు.

తిరిగి ఆలోచనలలో మునిగిపోయాడు. ఆ